నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, మంగళవారం 15 అక్టోబర్ 2024 | WARANGAL

బమ్మెర పోతన డిజిటల్ లైబ్రరీ

బమ్మెరను మరిచారా?

రెండేళ్లుగా పోతన డిజిటల్ మ్యూజియం మూసివేత

నిర్వహణ బాధ్యతలపై సందిగ్ధం

ప్రచారం కల్పించడంలోనూ అధికార యంత్రాంగం విఫలం

వరంగల్, అక్టోబర్ 14 : ఉమ్మడి జిల్లాకు చెందిన మహాకవి బమ్మెర పోతనను పాలకులు, అధికార యంత్రాంగం మరిచిపోయింది. ఆయన రచించిన భాగవతాన్ని భావి తరాలకు అందించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన బమ్మెర పోతన డిజిటల్ మ్యూజియం రెండేళ్లుగా మూతపడి ఉంది. రూ. కోటి నిధులతో ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని 15 ఏప్రిల్ 2022న అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. రెండేళ్లుగా దాని నిర్వహణ బాధ్యత ఎవరిదనే సందిగ్ధం నెలకొంది. పోతన విజ్ఞాన పీఠం ఆవరణలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ నిర్మాణం పూర్తి చేసి వదిలేసింది. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ చేపట్టాలని నిర్ణయించినా ఇప్పటి వరకు బాధ్యత తీసుకోలేదు. ప్రస్తుతం పోతన విజ్ఞాన పీఠం ఆధీనంలో మ్యూజియం ఉండగా, నిర్వహణ బాధ్యతలు ఎవరు చేయాలనే దానిపై సందిగ్ధంతో మ్యూజియం నిరుపయోగంగా మారింది.

లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్క్రీన్

ప్రచారం కరువు

బమ్మెర పోతన డిజిటల్ మ్యూజియానికి ప్రచారం కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఇప్పటి వరకు పెద్దగా సందర్శకులు, విద్యార్థులు వచ్చిన దాఖలాలు లేవు. మ్యూజియం ఉందన్న విషయం చాలా వరకు తెలియదంటే అతియోశక్తి కాదు. దాని నిర్వ హణ బాధ్యతలను పర్యాటక శాఖకు అప్పగించి విస్తృత ప్రచారం కల్పిస్తే మ్యూజియానికి సందర్శకులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఆధునిక సాంకేతికత

భాగవతంలోని ఏ అధ్యాయం చదవాలన్నా మ్యూజియంలో సుమారు 15 డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, సందర్శకులకు భాగవతం వివరించేందుకు హాల్, సీటింగ్ ఏర్పాటు చేశారు. పెద్ద స్క్రీన్‌పై 'పలికెడిది భాగవతమట.. పలికించేవాడు రామచంద్రుడట' పద్యంతోపాటు బమ్మెర పోతన, శ్రీరాముడి ఫొటో ఉన్న పెద్ద స్క్రీన్ కనిపిస్తుంది. పూర్తి ఏసీతో ఏర్పాటు చేసిన పోతన మ్యూజియం అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో మూతపడి ఉంది.

సిబ్బందిని నియమించాలి

మ్యూజియం ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న అధికారులు నిర్వహణ కోసం సిబ్బందిని నియమించడం మరిచారు. అప్పుడప్పుడు పోతన విజ్ఞాన పీఠం సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. మ్యూజియానికి వచ్చే సందర్శకులకు పోతన భాగవతాన్ని వివరించేందుకు గైడ్‌తోపాటు నిర్వహణకు కేర్ టేకర్, అటెండర్లను నియమించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. బమ్మెర పోతన రచించిన భాగవతం సారాంశాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

• సిరికొండకు ఎర్రబెల్లి శుభాకాంక్షలు



హనుమకొండ, అక్టోబర్ 14 : శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారిని సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఎర్రబెల్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేలు అడగలేదు.. ప్రభుత్వం ఇవ్వలేదు..

యంగ్ ఇండియా స్కూళ్లలో మొండిచేయి

- ఉమ్మడి జిల్లాలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లకు దక్కని చోటు
- తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాల్లో ఏర్పాటు
- ఐదుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఆగ్రహావేశాలు

వరంగల్, అక్టోబరు 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సంక్షేమ పథకాలే కాదు.. అభివృద్ధి పనులకు పేర్లు మార్చి అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన గురుకులాల వ్యవస్థకు కొత్తగా ఈ పేరు పెట్టింది. తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాల్లో స్కూళ్లను ఏర్పాటు చేస్తూ శుక్రవారం నిర్మాణాలకు శంకుస్థాపన చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, ములుగు, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు చోటు దక్కింది. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్, మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లకు మొండి చేయి చూపింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్లలోనే కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత లభించినప్పటికీ వీటికి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేయలేదు. ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వకపోవడం వల్లే స్కూళ్లు మంజూరు కాలేదని తెలుస్తున్నది. మొదట ఉమ్మడి వరంగల్ జిల్లాకు నాలుగే స్కూళ్లు మంజూరు కాగా, ఆ తర్వాత మరో రెండు అదనంగా ఇచ్చింది. ఈ జాబితాలోనూ ఈ ఐదు నియోజకవర్గాలకు స్కూళ్లు దక్కలేదు. సదరు ఎమ్మెల్యేలు స్కూళ్ల కోసం కనీసం ప్రతిపాదనలను పంపించలేదని తెలిసింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పటి నుంచి హైదరాబాద్ తర్వాత హనుమకొండ విద్యా కేంద్రంగా ఉన్నది. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, నర్సింగ్ కాలేజీ, గురుకులాలతో మరింత అభివృద్ధి చెందింది. విద్యా పరంగా రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఉన్న వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లాలో వరంగల్ తర్వాత కీలక ప్రాంతంగా ఉన్న మహబూబాబాద్ జిల్లాకు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయలేదు. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలిచారు. కొత్త విద్యా సంస్థలు, భవనాల మంజూరులో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు తొలిదశలో ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై విద్యావేత్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అన్ని రకాల విద్యా సంస్థలకు కేంద్రంగా ఉన్న హనుమకొండలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ భవనాన్ని తొలిదశలో నిర్మించకపోవడం సరైంది కాదని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి హనుమకొండ, మహబూబాబాద్ నియోజకవర్గాలకు స్కూల్స్‌ను మంజూరు చేసి భవనాలను నిర్మించాలని డిమాండు చేస్తున్నారు. గిరిజన పిల్లలు ఎక్కువగా ఉండే మహబూబాబాద్ జిల్లాలో కొత్త విద్యా సంస్థను తొలిదశలో నిర్మిస్తేనే మంచి ఫలితాలుంటాయని అంటున్నారు.

రామప్ప చరిత్ర తెలిసేలా..

నేటి నుంచి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్

- 12 రోజుల పాటు యువ వలంటీర్లకు శిక్షణ
- 22 మంది నిపుణులతో తరగతుల నిర్వహణ

వెంకటాపూర్, అక్టోబర్ 14 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్‌ను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నారు. యునెస్కో ఇండియా ఐకోమస్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, భారత పురావస్తు శాఖ, తెలంగాణ పర్యాటక శాఖ, ఇంటాక్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. చారిత్రక, పర్యాటక, వారసత్వ కట్టాడాలున్న ప్రదేశాలపై 12 రోజుల పాటు (26వ తేదీ వరకు) అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని యునెస్కో 2008లో ప్రారంభించింది. దీని ద్వారా ప్రపంచ వారసత్వ కట్టడాలపై యువతీ యువకులకు అవగాహన కల్పించనున్నారు. కొత్తగా గుర్తింపు పొందిన కట్టడాలపై ఐదేళ్ల పాటు వలంటీర్స్‌కు శిక్షణ ఇచ్చి వారి చేత ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రామప్ప కట్టడం, దాని నిర్మాణశైలి, నిర్మాణానికి వాడిన వస్తువులు, అప్పటి ఇంజినీరింగ్ టెక్నాలజీ, సంస్కృతి, కళలు, చరిత్రపై అవగాహన కల్పించనున్నారు. దేశ, విదేశాల్లో చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్ రంగాల్లో అవగాహన ఉన్న 18 నుంచి 35 ఏళ్ల యువతీ యువకులు 243 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి అందులో 40 మందిని ఎంపిక చేశారు. అలాగే వారితో పాటు యువ టూరిజం క్లబ్ నుంచి మరో 40 మందిని సెలెక్ట్ చేసి మొత్తం 80 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ శబరీశ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించనున్నారు. కాగా, 22 మంది నిపుణులతో శిక్షణ కార్యక్రమాలను పాలంపేటలోని రైతు వేదికలో నిర్వహించనున్నారు.

రామప్ప దేవాలయం

పార్టీ వ్యతిరేకులను ప్రోత్సహిస్తారా?

మంత్రి సురేఖపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే మొలుగూరి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

పరకాల, అక్టోబర్ 14 : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులను మందలించాల్సింది పోయి మంత్రి కొండా సురేఖ ప్రోత్సహిస్తున్నారని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేనే బాస్ అని, ఆయనకు సముచిత స్థానం కల్పించాల్సిందేనన్నారు. సోమవారం పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గీసుకొండ వర్గ పోరుపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల నాయకులు, పార్టీ శ్రేణులు కష్టపడి పని చేస్తేనే ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలిచారని, ఆయనను మంత్రులతో సహా ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందేనన్నారు. గీసుకొండ మండలం ధర్మారంలో చోటు చేసుకున్న ఘటనలో మంత్రి వాస్తవాలను తెలుసుకుని స్పందిస్తే బాగుండేదని, కానీ తప్పు చేసిన వారికి అండగా నిలవడం బాధకరమన్నారు. అదే తూర్పు నియోజకవర్గంలో మంత్రి ఫొటో లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కొండా దంపతులు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే కార్యకర్తలకు నాయకులు అండగా నిలవాలని, అనిల్‌పై దాడి చేయడం సరైందికాదన్నారు. ఏది ఏమైనా మంత్రిగా ఉన్న కొండా సురేఖ వర్గ పోరును ప్రోత్సహించడం మంచిది కాదని, ఈ విషయాన్ని ఖండిస్తున్నట్లు భిక్షపతి పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సోదా రామకృష్ణ, కొయ్యడ శ్రీనివాస్, కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబటపల్లిలో పోలీసుల నిఘా

- లక్ష్మీ బరాజ్, పలిమెల వైపు వెళ్లే వాహనాల తనిఖీ
- వంతెన వద్ద ప్రైవేట్ సెక్యూరిటీకి వార్నింగ్
- సీసీ పుటేజీల పరిశీలన

అంబటపల్లి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్ సమీపంలోని అంబటపల్లి గ్రామం వద్ద పోలీసులు సోమవారం రాత్రి మకాం వేశారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'అక్రమార్కులకు వారధి' శీర్షికన ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. మహదేవపూర్ సీఐ రాంచంద్రారావు, ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అంబటపల్లి వద్ద పలిమెల వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అనంతరం బరాజ్ వద్దకు వెళ్లి ప్రైవేట్ సెక్యూరిటీతో మాట్లాడినట్లు తెలిసింది. వంతెనపై నుంచి అటు మహారాష్ట్ర, ఇటు తెలంగాణకు బైక్‌లు మినహా మిగతా వాహనాలను ఎలా అనుమతిస్తున్నారని వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే బరాజ్ వద్ద సీసీ పుటేజీలను పరిశీలించినట్లు సమాచారం. వంతెన పైనుంచి అనుమతి లేకుండా ఎలాంటి వాహనాలు వెళ్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సెక్యూరిటీని సీఐ హెచ్చరించినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ రాంచంద్రారావు మాట్లాడుతూ లక్ష్మీ బరాజ్ వద్ద గతంలో సీఆర్పీఎఫ్ సిబ్బందితో క్యాంప్ ఉండేదని, దానిని తొలిగించాక ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇక్కడ తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని, సరిహద్దుపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అనుక్షణం సీసీ పుటేజీలు పరిశీలిస్తూ, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తున్నామని పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

నలుగురు యువకులపై కేసు

గీసుగొండ, అక్టోబర్ 14 : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామంలో ఆదివారం రాత్రి విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిననలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బొల్లె భిక్షపతి దుర్గామాత నిమజ్జనం సందర్భంగా ధర్మారంలో బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో అతడు అర్ధరాత్రి బైక్‌పై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వే గేటు వద్ద గ్రామానికి చెందిన బొలిశెట్టి అనిల్‌తో పాటు మరో ముగ్గురు యువకులు అడ్డుకున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా బండిపై ఎలా తిరుగుతున్నావని గొడవకు దిగడంతో పాటు భిక్షపతిని వీడియో తీస్తుండడంతో సెల్‌ఫోన్ లాక్కున్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన అనిల్ భిక్షపతిపై చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని ధర్మారంలో పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై కుమార్‌కు చెప్పడంతో తన సిబ్బందితో అక్కడికి చేరుకోగా ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన అనిల్‌ను అదుపులోకి తీసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డీజే పెట్టొద్దన్నందుకు..

ఖిలావరంగల్, అక్టోబర్ 14: ఉర్సులో ఆదివారం రాత్రి డీజే పెట్టొద్దని చెప్పిన ఇద్దరు కానిస్టేబుళ్లు ప్రవీణ్‌రెడ్డి, చిరంజీవిని స్థానిక యువకులు అసభ్య పదజాలంతో దూషించారు. బైక్ కీ లాక్కొని విధులకు ఆటంకం కలిగించారు. ఒక దశలో దాడి చేసే ప్రయత్నం చేయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయి మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఈ ఘటనపై పోలీసులతోపాటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాంతి భద్రతల పరిక్షణలో భాగంగా పోలీసులకే రక్షణ లేకుండా పోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్

- అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసింది
- 420 మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది
- పార్టీ అగ్ర నాయకులిచ్చిన హామీలు ప్రజలకు వివరిస్తాం
- విలేకరుల సమావేంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గీసుగొండ, అక్టోబర్ 14 : అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 420 మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ మోసాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నదన్నారు. తెలంగాణలో పార్టీ జెండా మారింది తప్ప పాలన మారలేదని అన్నారు. రైతుబంధు పేరు మార్చారే తప్ప ఆర్థిక సాయం అందించలేక రైతులను మోసం చేసిందని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నట్లుగా రాష్ట్రంలోని రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. పేదలకు ఇండ్లు కట్టిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి చెప్పి మూసీ సుందరీకరణ పేరుతో వారి ఇండ్లను కూలగొడుతున్నాడన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగిస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. అతి తక్కువ సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ పథకంపై స్పష్టమైన అవగాహన లేదని విమర్శించారు. మూసీ సుందరీకరణ పేరుతో రూ. లక్షా 50 వేల కోట్లు దోచుకోవడానికి కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. దేశంలో బీజేపీ మరింత బలపడుతున్నదని చెప్పటానికి అనేక రాష్ట్రాల్లో పార్టీ గెలుపే నిదర్శనమన్నారు. రాజీనామాలు చేయకుండా పార్టీ మారే ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసి ప్రజాతీర్పును అవహేళన చేశారన్నారు. వరంగల్ అభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ, అమృత్ పథకంలో పెద్ద ఎత్తున నిధులు ఇచ్చామన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కోసం ప్రభుత్వం భూమి సేకరించలేదన్నారు. మెగా టెక్స్ టైల్ పార్కుకు నిధులు కేటాయించింది కేంద్ర ప్రభుత్వమని, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాష్ట్ర నాయకులు రావు పద్మ, కాళీ ప్రసాద్‌రావు, విజయ్‌చందర్‌రెడ్డి, ఎడ్ల అశోక్ రెడ్డి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలి

- ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్‌ఫ్రీ నంబర్ ముద్రించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 14 : విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయం నుంచి అన్ని సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్ల(టెక్నికల్)తో సోమవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై టోల్‌ఫ్రీ నంబర్లు 1800 4250028, 1912 ముద్రించాలని చెప్పారు. సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్లను వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. లూజ్ లైన్లు, వంగిన, తుప్పు పట్టిన, కాలం చెల్లిన స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్ ప్లింత్‌లు, లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్, డబుల్ సర్క్యూట్, ఇండక్షన్ ఎఫెక్ట్ వచ్చే వాటిని గుర్తించాలని ఆదేశించారు. వీటన్నింటిని గుర్తించి పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని డిసెంబర్ నెలాఖరులోగా విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ (ఓఅండ్ఎం) స్టాఫ్‌తో ఇంటరాక్షన్ కార్యక్రమం ఉంటుందని సీఎండీ తెలిపారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు, భద్రత, జాగ్రత్తల విషయంలో రైతులకు అవగాహన పెంపొందించేందుకు అధికారుల పొలంబాట కార్యక్రమం చేపట్టామని, ఇందులో కరెంటు సరఫరా, వోల్టేజ్, వ్యవసాయ మోటర్లకు సంబంధించిన విషయాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నదని సీఎండీ తెలిపారు. వీసీలో ఇన్‌చార్జి డైరెక్టర్ (హెచ్ఆర్‌డీ) బీ అశోక్‌కుమార్, ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్) టీ మధుసూదన్, సీజీఎంలు కిషన్, అశోక్, జీఎం గౌతమ్‌రెడ్డి, డీఈ టీ శ్రీధరాచారి పాల్గొన్నారు.

ధర్మారంలో బందోబస్తు చేస్తున్న ఎస్సై కుమార్, పోలీసులు

పోలీస్ పహారాలో ధర్మారం

- ఇరు వర్గాలపై కేసు నమోదు
- డీసీపీ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షణ

గీసుగొండ, అక్టోబర్ 14 : దసరా పండుగ వేళ కొండా, రేవూరి వర్గీయుల గొడవతో ధర్మారం సహా గీసుగొండ మండలంలో ఒక్కసారిగా హైటెన్షన్ నెలకొనడంతో ఆ ప్రాంతం పోలీసు పహారాలోకి వెళ్లింది. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటో లేదని ఇరువర్గాలు బాహాబాహికి దిగి రచ్చరచ్చ చేయడంతో స్థానికంగా అలజడి రేగడంతో బందోబస్తు కట్టుదిట్టం చేశారు. తన వర్గీయులపై కేసులు నమోదు చేయడమే గాక పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ ఆదివారం సాయంత్రం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు మంత్రి సురేఖ వెళ్లి పోలీసులతో వాగ్వాదానికి దిగడం, తన వర్గీయులతో పాటు రేవూరి వర్గీయులపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టడంతో సీపీ చర్య లు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో మంత్రి అక్కడినుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆదివారం రాత్రి నుంచే ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో ధర్మారంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో పోలీసులు పికెటింగ్ పాయింట్ పెట్టి గస్తీ కాస్తున్నారు. కొత్త వారిని రానివ్వకుండా బయటకు పంపుతున్నారు. డీసీసీ, ఏసీపీ తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తున్నారు. ప్రజలు రోడ్లు మీద గుంపులు గుంపులుగా ఉండకూడదని పోలీసులు సూచిస్తున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గొడవకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. కొండా వర్గానికి చెందిన బండి రాజ్‌కుమార్, ముస్కు సురేశ్, కూస రాజ్‌కుమార్, శివ ప్రసాద్, ముస్కు రాజ్‌కుమార్, రాజు, మహేశ్వర్, వంశీలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం సోమవారం రేవూరి వర్గానికి చెందిన పిట్టల అనిల్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

ధర్మారం వెళ్లొద్దు.. సీపీ సూచన

ఇరువర్గాల దాడిలో గాయపడ్డ పిట్టల అనిల్‌ను పరామర్శించేందుకు జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి వెళ్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు సీపీ అంబర్ కిశోర్‌ఝాకు సమాచారం చేరవేశారు. సీపీ వారితో ఫోన్‌లో మాట్లాడి ఇప్పుడే గ్రామానికి వెళ్లొద్దని మళ్లీ గొడవలు జరిగే ఆస్కారం ఉందని విజ్ఞప్తి చేయడంతో వారు పరామర్శకు రాలేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.